క్లుప్తంగా

ఓటర్ల సర్వే నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి

ముదిగొండ: ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించాలని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి బీఎల్ఓలకు సూచించారు. శుక్రవారం తహసీల్‌లో బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరుకార్డుల్లో తప్పుల సవరణకు అవసరమైన పత్రాలను ఓటర్ల నుంచి స్వీకరించాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, ఆర్ఐ వహిద, జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

చింతకాని: రహదారి నిర్మాణ పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నేషనల్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ ఎన్.విల్లాన్ సూచించారు. చింతకాని మండల కేంద్రం నుంచి ప్రొద్దుటూరు గ్రామం వరకు పూర్తి చేసిన రోడ్డు నాణ్యతను ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల పరిశీలన కొరకు ఉపయోగించే పరికరాలు సక్రమంగా లేకపోవడంతో పీఆర్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాసరావు, జేఈ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ముదిగొండ: ఏపీలోని మల్కాపురం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని బాణాపురంలో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ ఓ.మురళి తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై కేసు

పెనుబల్లి: మండలంలోని గణేష్‌పాడుకు చెందిన వేము కృష్ణచైతన్య నకిలీ ప్రకటనలను నమ్మి రూ.2 లక్షలు పోగొట్టుకోగా వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణచైతన్య ఫోన్‌లోని యాప్‌కు ఉద్యోగం ఇప్పిస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు మెసేజ్ పంపడంతో రూ. 2 లక్షలు జమ చేశాడు. ఆతర్వాత వారు స్పందించకపోవడంతో మోసపోయానని గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

విషజ్వరంతో మహిళ మృతి

పెనుబల్లి: విష జ్వరం బారిన పడిన మహిళ మృతి చెందింది. మండలంలోని కొత్తకారాయిగూడెంకు చెందిన జొన్నలగడ్డ నాగమణి(38)కి రెండు రోజుల క్రితం జ్వరం రాగా చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. తిరిగి జ్వరం రావడంతో పెనుబల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించగా శుక్రవారం అక్కడ మృతి చెందింది. నాగమణి భర్త రత్నాకర్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

ముదిగొండ: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఏఎంఓ రవికుమార్ హెచ్ఎంలకు సూచించారు. మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో హెచ్ఎంలతో ఆయన మాట్లాడారు. పిల్లల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. పేటీఎం సమావేశాలకు తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో హాజరైయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ శ్యాంసన్, నోడల్ ఆఫీసర్ రమణయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకట్రామిరెడ్డి, శాంతి, ప్రసాద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కొణిజర్ల: మండలంలోని రామనరసయ్యనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాలలో పాఠశాల సిబ్బంది, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు దొడ్డా వెంకటేశ్వర్లు, ముజాఫర్, లక్ష్మణ్, జయ, స్వప్న, శివాజీలు సాధారణ బదిలీకాగా.. భాస్కర్, మాధవిలు పదోన్నతిలో బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వీరందరినీ సత్కరించారు. హెచ్ఎం షేక్ ఖాదర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాంతి, ఏఏపీసీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు మధు, సతీష్, ప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతి విద్యారంగానికి తీరని లోటు

మధిరరూరల్: సిద్దినేనిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు ఏడుకొండల రామారావు మృతి విద్యా రంగారానికి తీరని లోటని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్.నాగూర్ వలి అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన రామారావు మృతదేహాన్ని ఆయన స్వగ్రామంలో శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన వారిలో యూటీఎఫ్ నాయకులు చెన్నయ్య, లాల్ అహ్మద్, భాస్కరరావు, శ్రీనివాసరావు, శ్రీను తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు ఓర్వలేకే.. ప్రతిపక్షాల విమర్శలు



వైరా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, పక్కన నాయకులు

వైరా: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుస్థిర పాలన అందించడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని, అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అందిస్తామని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలు వారి స్వలాభం కోసం ధర్నాలు, నిరసనలు చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్ష నాయకులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై ప్రేమ ఉన్నట్టు గుండెలు బాదుకుంటున్నారు..



సత్తుపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, తదితరులు

సత్తుపల్లి: ప్రజలతో తిరస్కరించబడిన మాజీలందరు రైతులపై ప్రేమ ఉన్నట్లు గుండెలు బాదుకుంటున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలు మార్చటంలో సండ్ర వెంకటవీరయ్య ఆద్యుడని, ఎన్నిసార్లు పార్టీ మారారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టుపై మీరు ఆరోపణలు చేయడం సరికాదని, కాంగ్రెస్ గెలిచిన తర్వాత ఎలా పరుగులు పట్టించామో అందరికీ తెలుసన్నారు. రీ డిజైన్ పేరుతో బీఆర్ఎస్ ఒక్క ఎకరానికైన నీరందించిందా అని ప్రశ్నించారు? సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు.. పదిహేను రోజుల్లో రూ.2 లక్షలు రుణమాఫీ అమలయ్యేలా చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, తోట సుజలరాణి, మందపాటి ముత్తారెడ్డి, నర్సింహారావు, మౌలాలీ, రాంబాబు, నరేందర్‌రెడ్డి, కృష్ణ, సందీప్ గౌడ్, వెంకటప్పారెడ్డి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

వెంకటవీరయ్య చేసిన ఆరోపణలు సరికావు..

తల్లాడ: రుణమాఫీపై సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు సరైనవి కావని తల్లాడ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. తల్లాడలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వెంకటవీరయ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుధాకర్, నాయకులు రఘుపతిరెడ్డి, వీరారెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొద్దులగూడెంలో విద్యుత్‌శాఖ - పొలంబాట

వేంసూరు: మండలంలోని మొద్దులగూడెంలో శుక్రవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంర్భంగా రాయడు పాలెం ఏఈ జె.అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. వంగిన స్తంభాలను సరి చేయడం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చడం, కిందకు వేలాడుతూ లూజుగా ఉన్న లైన్లను సరి చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని, రైతులు భద్రతా సూత్రాలను మరియు విద్యుత్ పొదుపు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ సబ్ ఇంజనీర్ జిలాని, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, లైన్‌మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ - పొలంబాట కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

వైరా: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ ఇంటర్ 2024–25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువుపై ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలకు 9440504644, 9014584714, 9948707632 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు

కారేపల్లి: కారేపల్లిలో నాలుగు వైన్‌షాపుల యాజమాన్యం సిండికేట్‌గా మారి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టుతున్నారని మండల 'తుడుందెబ్బ' ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు శుక్రవారం ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మికి ఫిర్యాదు చేశారు. వైన్‌షాపు యాజమాన్యం బెల్టు షాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిని ఎం చేసుకుంటావో చేసుకో అంటున్నారని తెలిపారు. అలాంటి వైన్‌షాపు నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు రాంప్రసాద్, శివరాం, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లి ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న తుడుందెబ్బ నాయకులు

సత్తుపల్లి ఏడీఏగా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుడిగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న యు.నర్సింహారావు కొత్తగూడెంకు ఇటీవల బదిలీ కాగా.. ఆయన స్థానంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వ్యవసాయ అధికారులు వై.శ్రీనివాసరావు, రామ్మోహన్, కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఏన్కూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రాందాస్, నాగేశ్వరావులు కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జన్నారం, ఏన్కూరు, మూలపోచారం, బురదరాఘవాపురం పాఠశాలలను శుక్రవారం సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, అంగన్‌వాడీలను ప్లేస్కూల్స్‌గా నిర్వహించాలనే ప్రతిపాదన సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకుమారి, సుధాకర్‌రావు, రాంచంద్, పుల్లయ్య, రాఘవరావు పాల్గొన్నారు.

ఆకాశంలో వింత వెలుగులు!

కారేపల్లి: కారేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆకాశంలో వెలుగులు కనిపించాయి. ఆకాశంలో ఉత్తర దిశ భాగాన వింత ఆకారంలోని నాలుగు చుక్కలు విడిపోతూ కలుస్తూ చక్రంలా కనిపించాయి. గంటల తరబడి ఇలాగే కొనసాగగా స్థానికులు ఆసక్తిగా పరిశీలించారు. మరికొందరు మాత్రం ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు.

ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మధిర: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 ఆగస్టు 23న ప్రభుత్వం జారీ చేసిన 28 జీవో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని ఆరోపిస్తూ శుక్రవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగులు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ముదిగొండ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సైదులు, రాములు తదితరులు మాట్లాడారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో బుచ్చయ్య, మోషే, నాగేశ్వరరావు, రేణుక, ఉష, కృష్ణమూర్తి, రజనీకాంత్, మహేష్, సుధాకర్, వెంకటేశ్వర్లు, కత్తి శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

ఏన్కూరు: మొక్కలు పెంచడం సామాజిక భాద్యత అని మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్ అన్నారు. మండలంలోని తిమ్మారావుపేట ఓం ఆదిత్య గాయత్రి పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ దాసరి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వైరారూరల్: మండలంలోని ముసలిమడుగులో ఉన్న సమస్యలపై శుక్రవారం మాజీ సర్పంచ్ చింతనిప్పు కరుణాకర్, మాజీ ఎంపీటీసీ తడికమళ్ల నాగేశ్వరరావులు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యను, ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ అంశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని వినతిలో వివరించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సత్తెనపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా మాజీమంత్రి సిద్దారెడ్డి జయంతి



బనిగండ్లపాడులో సిద్దారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో శుక్రవారం మాజీ మంత్రి స్వర్గీయ శీలం సిద్దారెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, తదితరులు సిద్దారెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిచ్చిరెడ్డి, పుల్లారెడ్డి, అక్కిరెడ్డి, రామిరెడ్డి, ఉమామహేశ్వరి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ పాఠశాలలో వ్యర్థాల తొలగింపు

బోనకల్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలో ఉన్న వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలిగించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో జీపీ సిబ్బంది వాటిని తొలిగించి శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ పున్నం చందర్ అధ్యాపకులకు సూచించారు.

బీఎల్ఓ విధుల నుంచి మినహాయించాలి

వైరారూరల్: బీఎల్ఓ విధుల నుంచి మినహాయించాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు తహసీల్ అధికారులకు వినతిపత్రం అందించారు. పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా తయారీ, ఇతర పనుల ఒత్తిడి వలన తాము విధులు నిర్వర్తించ లేకపోతున్నామని వినతిలో వివరించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు వేణు, భార్గవి, రాధాకృష్ణ, రామకృష్ణ, శ్రీకాంత్, కుమార్, అబ్దుల్ రహీం, సరిత తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

పాఠశాలకు మైక్‌సెట్...

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సీపీఎస్ (గుట్టబడి) పాఠశాలకు శుక్రవారం డాక్టర్ పి.భాస్కర్‌రావు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.12 వేలు విలువ చేసే మైక్‌సెట్ వితరణగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, బాధ్యులు ఉపేందర్, రాంబాబు, రాంగోపాల్, శ్రీధర్, సురేష్, రాము, హెచ్ఎం శ్రీనివాసచారీ తదితరులు పాల్గొన్నారు.

సదాశివునిపేట పాఠశాలకు రూ.10వేలు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మాదిరాజు మాలతి తన తల్లిదండ్రులైన మాదిరాజు సుశీలదేవి, బాపిరాజుల జ్ఞాపకార్థం రూ.10వేలు వితరణగా హెచ్ఎం బి.బుచ్చి బాబుకు అందించారు. ఇదే పాఠశాలలో మాదిరాజు మాలతి పనిచేసి ఇటీవలే పదవీవిరమణ పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తుంబూరు సరస్వతి, మందపాటి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వినుకొండ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..

తల్లాడ: మండలంలోని మల్లవరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, శ్రీపివాసరావు, హెచ్ఎం పద్మజా తదితరులు పాల్గొన్నారు.

పోలంపల్లి ప్రాథమిక పాఠశాలలో..

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి ప్రాథమిక పాఠశాలలో వెలమూరి ఫౌండేషన్, హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అజ్మీర వీరునాయక్, గ్రామస్తులు సత్యనారాయణ, రాజశేఖర్, అంజిబాబు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ స్పేస్ డే

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి, ఐక్యూఏసీ (ఇంటర్నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్) ప్రతినిధి ప్రజ్ఞ ఐశ్వర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, సెమినార్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నవ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యూపీఎస్‌లో మందులు అందిస్తున్న వైద్యులు

పెనుబల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అన్నపూర్ణ తెలిపారు. శుక్రవారం వీయంబంజర్ యూపీఎస్ స్కూల్ ఆవరణలో లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో ర్యాపిడ్ నిర్వహించి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదుగ్రామాల్లో వైద్యశిబిరాలు

బోనకల్: మండలంలోని నారాయణపురం, తూటికుంట్ల, చొప్పకట్లపాలెం, ఆళ్లపాడు, గోవిందాపురం గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజలను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడు గ్రామాల్లో..

చింతకాని: మండలంలోని చింతకాని, మత్కేపల్లి, నాగులవంచ, ప్రొద్దుటూరు, కోమట్లగూడెం, లచ్చగూడెం, నాగులవంచ రైల్వేకాలనీ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది శుక్రవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్లు వేణుమాధవ్, సుప్రియ, వెంకటేశ్వర్లు, సోయల్, సీహెచ్ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, నాగేశ్వరరావు, ఏఎస్ఎంలు జయమ్మ, నర్సమ్మ, సుజాత, రేణుక, పద్మావతి, రజిని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: నాగులవంచ రైల్వేకాలనీలో..

తల్లాడలో హోమియో శిబిరం..

తల్లాడ: తల్లాడ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో ఆయుష్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన వృద్ధాప్య ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని మండల వైద్యాధికారి రత్న మనోహర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో షుగరు, బీపీ, ఆస్తమా, మొలలు, మోకాళ్ల నొప్పులు, గ్యాస్, జ్వరం తర్వాత వచ్చే నొప్పులకు, సైనటీస్ వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మదులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యాధికారిని నీలిమ, ఆయష్ విభాగం జిల్లా ప్రోగ్రాం అధికారి బాబు నాయక్, రాంప్రసాద్, లలిత, జానీబీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం

బోనకల్/వైరారూరల్/పెనుబల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం బోనకల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాలు పాల్గొనగా.. వైరారూరల్ మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పలు ఇళ్లల్లోని గాబులు, కుండీల్లో నిల్వ నీటిని తొలగించడం, బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడంతో పాటు రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమాలల్లో వైద్యాధికారి స్రవంతి, ఏపీఎం పద్మలత, పంచాయతీ కార్యదర్శి భారతి, మల్టీపర్పస్ వర్కర్లు కరీం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వైరారూరల్: లక్ష్మీపురంలో బ్లీచింగ్ చల్లుతున్న జీపీ సిబ్బంది

కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



శిక్షణకు హాజరైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరులో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ నెల 20 వ్యక్తిత్వ వికాసంపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మెంటార్స్‌గా రిటైర్డ్ డీఎం, ఇంప్యాక్టు కొత్తగూడెం క్లబ్ ప్రెసిడెంట్ జవ్వాది వెంకటేశ్వరబాబు, ఇంప్యాక్టు రీజినల్ డైరెక్టర్ ఇంటూరి భాస్కర్‌రావులు వ్యవహరించారు. ఈ తరగతుల్లో విద్యార్థులకు కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఎలా సాధించాలి మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, రామచంద్రరావు, పి.మారేశ్వరరావు, పంతంగి మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన షేక్ జానీకి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారస్‌తో వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు మంజూరైన రూ.14వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు బాధితుడికి అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సునీత, సీపీఎం నాయకుడు లక్ష్మణరావు, చంద్రయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



వైరా: తహసీల్ ఎదుట నిరసన తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీని షరతులు లేకుండా ప్రతీ ఒక్క రైతుకు వర్తింపజేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి.. తహసీల్ ఎదుట నిరసన తెలిపి సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ఆధార్, రేషన్ కార్డులతో సంబంధం లేకుండా తక్షణమే రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ముళ్లపాటి సీతారాములు, చెరుకూరి చలపతిరావు, సుంకర సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

బోనకల్: మండలంలోని తహసీల్ ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మండల వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏఓ కొండూరు విజయ బాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు చితలచెర్వు కోటేశ్వరరావు, నాయకులు నాగేశ్వరావు, శ్రీను, శ్రీనివాసరావు, సునీత, విశ్వనాధం పాల్గొన్నారు.

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో..

కల్లూరు: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కల్లూరు రైతు వేదిక వద్ద రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. సమస్యలపై ఏఓ ఎం.రూపకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సామినేని హనమయ్య, ముదిగొండ అంజయ్య, వెంకటేశ్వరరావు, వ్య.కా.సం సభ్యులు కృష్ణార్జునరావు, రవి, సర్వేశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నాసరయ్య, కృష్ణయ్య, పుల్లయ్య, మాధవరావు పాల్గొన్నారు.



బోనకల్: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



కల్లూరు: రైతు వేదిక ఎదుట..

రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో..

ముదిగొండ: మండలంలోని తహసీల్, రైతు వేదిక ఎదుట తెలంగాణ రైతు సంఘం, సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఏఓ సరితలకు వినతులు అందించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల అధ్యక్షుడు బాస్కర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

మాకు రుణమాఫీ వర్తించదా ?

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతు రుణమాఫీ పథకం కొంతమంది రైతులను తీవ్ర నిరాశ పరుస్తుంది. మండలంలోని నాగులవంచకి చెందిన రైతు అంబటి రాజేష్ గ్రామంలోని సొసైటీ ద్వారా 2022 సంవత్సరంలో లక్షా పదివేల రూపాయల పంట రుణాన్ని తీసుకున్నాడు. 2023 అక్టోబర్ నెలలో రుణ మొత్తాన్ని చెల్లించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో.. రాజేష్ రుణకాతాలో అప్పుగా ఉన్న రూ.2 లు మాఫీ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో తనకు కూడా రుణమాఫీ పథకాన్ని వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. ఈ విషయమై సొసైటీ సీఈఓ యాలమూడి శ్రీనివాసరావును వివరణ కోరగా.. ప్రభుత్వ నిబంధనల మేరకే రుణమాఫీ పథకాన్ని ప్రతీ రైతుకు వర్తింపచేస్తున్నామన్నారు. తన ఖాతాల్లో కేవలం రెండు రూపాలయు మాత్రమే అప్పు ఉండడంతో ప్రభుత్వం ఆ అప్పును మాఫీ చేసిందని తెలిపారు.